# సర్వర్ గోపి

-పంజాల జగన్నాథం

పత్రికలో వార్త. గోపి రాసిన 'మట్టి వాసనలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ప్రకటించారు. అర్థ సంబంధాలు, ప్రపంచీకరణ మానవ సంబంధాలను ఎలా ధ్వంసం చేస్తున్నాయో...! ఆధారితంగా రాసిన కథల సంపుటి. 2005 సంవత్సరానికిగాను ఈ పురస్కారం బహూకరించబోతున్నారు. త్వరలో జరగబోయే ప్రదానోత్సవ వేడుకల్లో వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఉన్నతంగా కృషిసల్పిన వివిధ భారతీయ భాషలకు చెందిన పలువురికి సన్మానం చేయనున్నారు.

ఈ వార్త చదవగానే గోపికి తను పడ్డ శ్రమకు గుర్తింపు లభించిందని, తన కల ఫలించిందన్న సంతోషం ఓవైపు మనస్సుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా, ఈ సంతోష సమయంలో తనని పెంచిన తండ్రి కొమురయ్య లేకపోవడం అనే విషాదం గోపి గుండెల్ని పిండి చేస్తున్నది. పురస్కారం గ్రహించడానికి ఢిల్లీకి రావలసిందిగా గోపికి ఆహ్వానం అందింది. ఆ రోజు రానే వచ్చింది. తనని పెంచిన తల్లిని వెంటపెట్టుకుని గోపి రైల్లో ఢిల్లీకి ప్రయాణమయ్యాడు. రైల్లో పండ్లు, బిస్కట్లు, మాగజైన్లు అమ్ముకునేవాళ్ళ గోల. రైల్లో ఎక్కనివాళ్లు, సీట్ల కొరకు వెదుకులాట. స్టేషన్లో ఎక్కి, దిగేవాళ్ళ సందడి. టీ, కాఫీ అమ్ముకునే వాళ్ల అరుపులు, పోర్టర్ల సామాన్ల మోతలు. ఉరుకులు, పరుగులు. ఓ వింత ప్రపంచాన్ని చూస్తున్నాడు గోపి.

రైల్లో ఓ గుడ్డివాడు- "రావడం ఒక్కడే.. పోవడం ఒక్కడే... మధ్య ఈ నాటకం.. ఎందుకీ లీలలు...!" అంటూ వేదాంతం మిళితమైన ఓ పాట రాగయుక్తంగా భావయుక్తంగా లయబద్ధంగా చక్కని కంఠస్వరంతో శ్రావ్యంగా పాడుతున్నాడు. దానికి తగ్గట్టు డప్పు వాయిస్తున్నాడు. ఆ గీతంలో ఏదో తెలియని తడి.. అలజడి అనుభూతి... గోపి మదిని కదిలించింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తన జేబులోని ఓ రూపాయి బిళ్ల ఆ గుడ్డివానికి ఇచ్చాడు.

రాత్రి పదవుతోంది. రైల్లోకి కిటికీల గుండా చల్ల గాలి ఆగి ఆగి కొసరుతుందా అన్నట్లు మెల్లగా వీస్తోంది. ఆకాశాన వెన్నెల రాజ్యమేలుతోంది. నక్షత్రాల వీధిలో తెల్లని మబ్బులు వివిధ ఆకృతుల్లో వెండిలా మెరుస్తూ పరుగులు పెడుతున్నాయి. ఏదో స్టేషన్ వచ్చినట్టుంది. 'టీ.. కాఫీ..' అంటూ కేకలు. 'టీ' అంటూ కేకేశాడు గోపి. ఓ పెద్ద థర్మాస్‌తో ఓ కుర్రాడు గోపి వద్దకు వచ్చాడు. రెండు 'టీ'లు తీసుకుని ఒకటి తన తల్లికి తాగించాడు. తనూ ఒకటి తాగాడు. రగ్గు కప్పాడు తల్లికి.

రైలు 'చుక్.. చుక్..' మంటూ కదిలిపోతుంది. "కన్నోళ్లు వదిలిపోయారు... పెంచినోళ్ల ప్రేమ పంచినారు..." అంటూ లయబద్ధమైన డప్పు వాయిద్యంతో మరోపాట అందుకున్నాడు ఆ గుడ్డోడు. రాగం కలుపుతోంది మరో గుడ్డామె. అతని భార్య కాబోలు. గుడ్డోనికి ఆ పాటలే జీవన నాదం, జీవనాధారం... అని మనసులో అనుకున్నాడు గోపి. ఆ రాగంలో ఏదో ఆర్తనాదం. ఏదో విషాద స్వరం... ఏదో జీవన వేదం స్ఫురించింది గోపికి. జాలిగలవాళ్లు పైసలేస్తున్నారు. కరగని హృదయాలు మౌనంగా ఉంటున్నాయి. ఇంతలో నది వచ్చింది. వంతెన మీద నుంచి రైలు వెడుతోంది. మౌనంగా ఉన్న మనుషులే నదిలో డబ్బులు విసిరేసి మొక్కుకుంటున్నారు. విచిత్రమనిపించింది గోపికి. అతని మనస్సు ఎక్కడికో వెళ్లింది. తన స్మృతి పథంలో గత జీవిత ఘట్టాలు లీలగా కదలసాగాయి.

❖ ❖ ❖

కొమురయ్య సైకిల్ మీద కూరగాయల గంప పెట్టుకుని వాడవాడకు తిరిగి కూరగాయలు అమ్మి జీవనోపాధి చేసుకుంటున్న సగటు కుటుంబీకుడు. ఓ రోజు కొమురయ్య సైకిల్ తోసుకుంట రోడ్డు మీద వెళుతున్నాడు. ఓ చోట కల్వర్టు మీద పదేండ్ల బాలుడు ఏడుస్తూ కనబడ్డాడు. ఆ బాలుడి వాలకం చూస్తే మాసిన అంగీ, లాగు అక్కడక్కడ చిరుగులు పట్టి ఉన్నాయి. చింపిరి తల, చీమిడి ముక్కు కొమురయ్య. పిల్లవాని వద్ద సైకిల్ ఆపి "ఏంది బాబూ ఎవరు నువ్వు! గిక్కడున్నావ్? ఎందుకేడుస్తున్నవ్...? నీ పేరేంది...?" అనునయిస్తూ అడిగాడు.

ఊ... ఊ... అని కండ్లు నులుముకుంటూ ఏడుస్తూ "నా పేరు గోపి, మా నాయిన్న సచ్చిపోయినంక ఆర్నెల్లకు మా అవ్వ సచ్చిపోయింది. అదేదో రోగమట. జరంతోటి మూలిగి, మూలిగి సచ్చిపోయింద్రు. అవ్వయ్య తరఫున

ఎవ్వలు లేరు. బతికున్నప్పుడు నాయిన్న కూలికిపోయె టోడు. అవ్వ బీడీలు సుట్టేది. ఊరవతల తాటాకుల గుడిసెల మేముండేది. నేను సర్కార్ బల్లె సదువుకునేది. గిప్పుడేమో ఎవల్లేక గేడికే వచ్చిన. బజార్ల వెంట ప్లాస్టిక్ సంచులు ఏరుకుని అమ్ముకునేది. ఆకలయినపుడు హోటల్ల అటుకులు బుక్కేది. గిప్పుడేమో 'వెల్‌కం' హోటల్ల 'ఛా' కప్పులు కడుగుతున్న. గదే హోటల్ల పెట్టింది తింటున్న, తొడుక్కుంటానికి వాళ్ల కొడుకు పాత బట్టలిచ్చింగ్రు. ఇయ్యాల్ల చేయిజారి కప్పు పగి లింది. యజమాని కొట్టిండు" పిల్లవాడికి ముక్కు నుంచి చీమిడి కారుతోంది. తుడుచుకుంటూ విషయం సంగ్రహంగా చెప్పాడు.

లోకం పోకడ తెలియని పాలబుగ్గల పసివాన్ని చూస్తే కొమురయ్యకు జాలేసింది. గోపి కళ్లల్లో అమాయ కత్వం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. కొమురయ్య ఆ బాలున్ని వెంట తోడ్కొని పోయాడు. కొమురయ్య దంప తులకు పిల్లలు లేరు. గోపిని దేవుడిచ్చిన వరంగా భావించారా దంపతులు. గోపే వాళ్లకు సర్వం అయ్యాడు. ప్రేమతో పెంచుకుంటున్నారు. గోపిని గవర్న మెంటు స్కూలుకు పంపిస్తున్నారు. కొమురయ్య కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తు న్నాడు. వేన్నీళ్లకు, చన్నీళ్లు తోడయినట్టు కొమురయ్య భార్య బీడీలు చేస్తూ వచ్చిన ఆదాయాన్ని భర్తకు అందిస్తుంది. కొమురయ్య కూరగాయలే కాకుండా సీజనల్ పండ్లను కూడా అమ్మేవాడు. సంసారాన్ని మిక్కు టంగా గుంజుకొస్తున్నాడు. అట్లా, ఇట్లా కష్టపడి గోపి పదో తరగతి పూర్తిచేశాడు. కాలేజి చదువులు చెప్పించ లేని ఆర్థిక దుస్థితి కొమురయ్యది.

ఒకసారి ఏమయిందంటే అకస్మాత్తుగా గోపి కడుపు నొప్పితో మెలికలు తిరిగి పోసాగాడు. కొమురయ్య కొడుకు బాధను చూడలేక అమాంతం అతన్ని భుజాన వేసుకుని ఒక్కదుటున డాక్టర్ వద్దకు పరుగెత్తాడు. తన దగ్గర ఉన్న ఇరవై రూపాయలు డాక్టర్ చేతిలో పెట్టి "అయ్యా! నా కొడుకు కడుపు నొప్పికి మందియ్యండి" అంటూ చేతులు జోడించి నిలుచున్నాడు.

మరోసారి సాయంకాలం స్కూలు చుట్టీ అయినంక ఆకలితో ఆవురావురమంటూ గోపి ఇంటికి వస్తూనే "అమ్మా ఆకలయితుందే...!" అంటూ అమ్మ దగ్గర దిగాలుగా చూస్తూ నిలుచున్నాడు. అతని ముఖం పీక్కు పోయి ఉంది. కళ్లు లోతుకు పోయాయి.

పార్వతమ్మకు ఏమీ మనసున పడతలేదు. ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా వెదికింది. డబ్బాలు చూసింది. ఓ డబ్బాలో కొన్ని నూకలు కనబడినయి. ప్రాణం లేచొచ్చింది పార్వ తమ్మకు. వాటిని వండింది. గంజి వార్చింది. ఓ గిన్నెలో నూకలన్నం, ఇంత తొక్కు వేసి కొడుక్కు తినమని ఇచ్చింది. వార్చిన గంజి భర్త కొమురయ్యకు దాచి పెట్టింది.

"నీకేదమ్మా...!" అని గోపి పార్వతమ్మను అడిగితే 'బీడి కంపెనీ కాన్నే టిఫిన్ చేసచ్చిన బిడ్డా!" అని సమా ధానం చెప్పింది. పసితనపు జ్ఞాపకాలన్నీ గోపి మన సును స్పృశిస్తూనే ఉన్నాయి. ఆ జ్ఞాపకాలన్నీ అప్పు డప్పుడు గుర్తుకు వచ్చి గుడ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

❖ ❖ ❖

ఓ రోజు "బాపూ! రాత్రి పూట 'గీతాభవన్' హోటల్ల ఆరు నుంచి పది వరకు సర్వర్‌గ పనికి కుది రిన. గా పైసల తోటి కాలేజిల చదువుకుంట" అని

## కష్టపెట్టిన చిత్రం 'సిరివెన్నెల'

**వ్య**యనామ సంవత్సరపు 'ఉగాది' సందర్భంగా మూ డు రోజులపాట గుంటూరులో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న తెలుగు చలన చిత్ర దర్శకుడు కళాతపస్వి శ్రీ కె.విశ్వనాథ్ నేటి చిత్రాల స్థితికి ఒకింత బాధను వ్యక్తం చేశారు.

తాను ఇష్టపడిన చిత్రాలకన్నా- కష్టపడిన చిత్రం 'సిరివెన్నెల' అనీ.. అందులోని ప్రతి దృశ్యాన్ని వివే కంగా తీర్చిదిద్దేందుకు నెలల తరబడి నిద్రలేకుండా ఆలోచించవలసి వచ్చిందనీ- ఒక నేత్రాల్లేని వ్యక్తిగా- 'సర్వదమన్'- మూగకన్నెగా 'సుహాసిని' చక్కని నటన ప్రదర్శించారనీ- సీతారామశాస్త్రి పేరుకు ముందు 'సిరివెన్నెల'గా చిరస్థాయిగా నిలిచిపోయేందుకు వీలయిందనీ తెలిపారు. దర్శకత్వ బాధ్యతలు నెరపే సమయంలో క్రమశిక్షణకూ, సమతా భావనకు చోటిచ్చే ఖాకీ దుస్తులను ధరించడం తనకలవాట యిందనీ- దర్శకుడిగా- నటుడిగా ఒక చిత్రంలో పనిచేసినా- ఏ బాధ్యతకాబాధ్యతేనని దర్శకత్వం నెరపినంత కాలం ఖాకీ దుస్తుల్లోనే కనిపించేవాడిననీ- పాత్రోచితమైన దుస్తుల్లో విడిగా కన్పించేవాడిననీ- డా॥ యస్.మధుసూదనరావు (కృష్ణప్రియ నర్సింగ్ హోం) గారి ఆతిథ్యం స్వీకరిస్తూ ఇష్టాగోష్ఠిలో ఇలా ఎన్నో ఆసక్తికర విషయాలు చెప్పారు.

-రావెల పురుషోత్తమరావు

గోపి నసుగుకుంట కొమురయ్యతో చెప్పినపుడు గోపి వైపు ఆశ్చర్యంగా చూస్తూ గుండెల కదుముకున్నాడు. కళ్లల్లో చిప్పిల్లిన నీళ్లను పంచతో తుడుచుకున్నాడు. పిల్లవానికి పై చదువులు చెప్పించలేని తమ అశక్తతకు తమలో తామే బాధపడ్డారు కొమురయ్య దంపతులు. నులక మంచం మీద కూచొని మౌనంగా నేల చూపులు చూస్తున్నారు.

"ఏం బాపూ...! సప్పుడు జేయవ్!" అంటూ కొమురయ్యను పట్టుకుని ఊపిండు.

"ఏం సప్పుడు జేయాలె బిడ్డా! తన గోపి శానా గొప్పోడు కావాలె! అందరితోటి 'శభాశ్' అనిపించుకోవాలె! పదుగురికి సాయపడాలె! ఊరంతా నిన్ను మెచ్చుకుంటె సూడాలని మాకు మాత్రం ఉండదా బిడ్డా! అట్లనే నువు సదువుకో బిడ్డా! మా చాతనయినంత డబ్బు సాయం జేత్తం బిడ్డా" అంటూ కొడుకును దగ్గరకు తీసుకున్నాడు.

"గట్లనే బాపూ! మీరనుకున్నట్లు బాగా కష్టపడి చదువుతా!"

"గంతకంటె మాకేం గావాలె బిడ్డా. నువ్వు శానా పెద్దోవిడి గావాలె!" సంబురంగ అంది పార్వతమ్మ.

"నిన్ను పావురంగా జూసుకున్నం గానీ పెద్ద సదువులు సదిపియ్యలేని ప్యాదోన్ని బిడ్డా."

"బావూ! బాధపడుతవెందుకు. మనింట్ల కష్టాలు, మీ గోస నేను జూత్తలేనా! ఓటిగా పోతే ఓటి ఏదన్న పని జేసుకొని చదువుకుంట. నువ్వేం రంది పడకు."

"సరే నీ ఇష్టం బిడ్డా."

కొమురయ్య గోపిని గవర్నమెంటు స్కూళ్ల ఎస్ఎస్‌సి వరకు చదివి పిచ్చాడు. ఎస్ఎస్‌సిలో గోపికి మంచి ర్యాంకు వచ్చింది. ప్రభుత్వం అతనికి ప్రతిభా పురస్కారం ఇచ్చి ప్రోత్సహించింది. కొమురయ్యకు తన గోపి ప్రయోజకుడవుతాడనే విశ్వాసం కలిగింది. 'పెద్ద చదువులు' ఎట్లా అని పత్తాయిస్తోన్న తరుణంలో గోపి తనే ఓ ఉపాధి చూసుకొని భవిష్యత్‌లో పై చదువులు చదువుకోడానికి ఓ దారి ఏర్పరచుకున్నాడు.

ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కాలేజికి వెళ్లడం. ఇంటికి వచ్చాక ఇంటి పనులు చూసుకోవడం అమ్మా నాన్నలకు సాయపడటం... పొద్దుకి ఆరు గంటలకు హోటల్‌కు వెళ్లి రాత్రి పది గంటల వరకు సర్వర్‌గ పనిచేయడం.. ఇంటికి వచ్చాక భోంచేసి రాత్రి ఒంటి గంట వరకు చదువుకోవడం... ఇదీ అతని దినచర్య.

గోపి దైనందిన జీవితం అలా గడిచిపోయింది. బి.ఏ. ఫస్టు క్లాసులో పాసయ్యాడు. ఇపుడు గోపి ఆలోచన విధానం మారింది. సాహిత్యం ద్వారా సమాజానికి సేవ చేయాలనుకున్నాడు. తరిగిపోతున్న మానవ విలువలను గురించి తల్లడిల్లుతున్నాడు. ఓ ఉన్నతమైన ఆశయ సాధన తన జీవిత లక్ష్యంగా ఏర్పరుచుకున్నాడు.

గోపి ఎం.ఏ. (తెలుగు) లిటరేచర్‌కు ఫీజు కట్టాడు. తరచూ గ్రంథాలయానికి వెళుతున్నాడు. సోక్రటీస్, మార్క్స్, జిడ్డు కృష్ణమూర్తి, ఠాగూర్, వివేకానంద... వంటి ఎందరో మహామహుల తత్త్వ, వేదాంత, సామాజిక, ఆర్థిక శాస్త్రాలకు సంబంధించి అనేక గ్రంథాలను అధ్యయనం చేస్తున్నాడు. ఇలా సాహిత్యమే తన ప్రపంచమయింది.

## బాలచంద్రులు

పున్నమి రాతిరి వచ్చింది
నిండుగ వెన్నెల కాచింది
పిల్లలు సంబర పడ్డారు
ఆటలు ఎన్నో ఆడారు
హాయిగ నిదుర పోయారు
కమ్మని కలలు కన్నారు
చంద్ర మండలము వెళ్ళారు
బోలెడు వింతలు చూశారు
బాలచంద్రులై వచ్చారు

## కోయిలమ్మ రావే..

చెట్టు పైన కోయిలమ్మా
కొమ్మల్లో ఎక్కడమ్మా
పిచ్చుకమ్మ వచ్చింది
పలకరించి వెళ్ళింది
కాకమ్మ వచ్చింది
కబురు చెప్పి వెళ్ళింది
చిలకమ్మ వచ్చింది
పండు యిచ్చి వెళ్ళింది
కోయిలమ్మ రావే
కొమ్మ దిగి రావే
పాపకు పాటను నేర్పవే!

–'శంకర'

ఏ మనిషికయినా జీవితంలో కష్టాలు తప్పవేమో! కలో గంజో తాగుకుంటూ సాఫీగా సాగిపోతున్న గోపి కుటుంబంలో కష్టాలు కాలు మోపాయి.

ఓ రోజు కొమురయ్య 'కడుపునొప్పి' అంటూ పొట్ట చేతబట్టుకుని అరుస్తూ మెలికలు తిరిగిపోతున్నాడు. బాధతో విలవిల్లాడుతున్నాడు. గోపి అందుబాటులో వున్న ఓ చిన్న డాక్టర్‌కు చూపించాడు. మందులు వాడుతున్నాడు. తాత్కాలికంగా ఉపశమనం కలిగింది. ఈ మధ్యన కడుపు నొప్పి తరచుగా వస్తోంది. ఇదేదో క్రానిక్‌లా ఉంది. పట్నంల పెద్ద డాక్టరుకు చూపించండి" అని సలహా ఇచ్చాడు చిన్న డాక్టర్.

పట్నంల డాక్టర్‌కు చూపించుడు మాటలా! ఓ దిక్కు అన్ని చేతులు కలిస్తేనే నాలుగు వేళ్లు నోట్లోకి బోతలేవు అని దిగాలు పడ్డాడు గోపి. అయినా ధైర్యాన్ని కూడబలుక్కున్నాడు గోపి. తన హోటల్ యజమానికి 'బాపు' కడుపునొప్పి విషయం, కుటుంబ పరిస్థితి వివరించి చెప్పాడు. ఋణరూపేణా ఆర్థిక సహాయం చేయమని చేతులు జోడించాడు. యజమాని దయార్ద్ర హృదయంతో "సరే" అన్నాడు.

గోపి బాపును పట్నంల పెద్ద డాక్టర్‌కు చూపించాడు. ఏవేవో పరీక్షలు చేశాక రిపోర్ట్స్ చూసి గోపిని తన చాంబర్‌కు పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడాడు. విషయం సంగ్రహంగా చెప్పాడు. గోపి అవాక్కయ్యాడు. దిగాలు పడిపోయాడు.

'బాపుకు రెండు కిడ్నీలు చెడిపోయాయా! ఒక కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తేగాని బతకడు. పేదోళ్లకా గీకడగండ్లు. కన్న తల్లిదండ్రులు బాల్యాన్నే పోయింద్రు. ఏనాటి అనుబంధమో! రోడ్డున పడ్డ నన్ను వీళ్లు చేరదీసి తల్లీ తండ్రీ అయ్యారు. ప్రేమను పంచి ఇచ్చారు. ఏమిటీ...?!" గోపి మనసు అల్లకల్లోలమవుతోంది.

"డాక్టర్ గారూ నాకు కావలసిన పరీక్షలు చేయండి. నా కిడ్నీ మా బాపుకు అమర్చి బతికించండి సార్" అని ఓ రోజు గోపి పట్నం వెళ్లి డాక్టర్ ముందు దీనంగా చేతులు జోడించాడు. డాక్టర్ గోపిని ల్యాబ్‌లోకి పంపించి కావలసిన పరీక్షలు చేయించాడు. రిపోర్ట్స్ చూశాక డాక్టర్ ఆశ్చర్యపోయాడు. 'What a strange' గోపికి ఒకే కిడ్నీ ఉంది. డాక్టర్ గోపిని చాంబర్‌కు పిలిపించుకుని ఈ విషయాన్ని చెప్పాడు. నీ కిడ్నీని తీయడం సాధ్యంకాదు. మెడికల్ కేసుల్లో ఇలా లక్షల్లో ఒకరుంటారని చెప్పాడు. గోపి హతాశుడయ్యాడు. కిడ్నీ దాతలు లేరు. కొనే తాహత్తు లేదు. గోపికి ఏమిచేయాలో పాలుపోలేదు. నిరాశతో ఊరికి వెనుదిరిగాడు. తాత్కాలిక ఉపశమనానికి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నాడు. గోపి 'బాపూ' శారీరక బాధను చూడలేక పోతున్నాడు. కొంత కాలానికి కొమురయ్య నరకయాతన అనుభవించి అంతిమ శ్వాస వదిలాడు. ఈ సంఘటన గోపిని మానసికంగా ఎంతో కుంగదీసింది.

తెలతెలవారుతోంది. రైలు ఢిల్లీ చేరువలో ఉంది. మధ్యలో ఏదో పెద్ద స్టేషన్ వచ్చింది. పిల్లల 'చాయ్, సమోసాల' కేకలతో మదిలోని గత జ్ఞాపకాలు ఎండుటాకుల్లా ఎగిరిపోయాయి. అమ్మ, గోపి మొకాలు కడుక్కున్నారు. చాయ్ తాగారు. కొద్దిసేపట్లో రైలు ఢిల్లీ చేరుకుంది. అకాడమీ తరఫున చౌల్ట్రీలో ఏర్పాటు చేసిన గదిలో ఈరోజు బసచేశారు. మరుసటి రోజు సాయంత్రం నాలుగింటికి తయారయి దగ్గర్లో ఉన్న హోటల్లో అల్పాహారం ముగించారు. నెమ్మదిగా ఆరు గంటలకు జరుగబోయే పురస్కార వేడుకలకు టాక్సీలో బయలుదేరారు.

విశ్వసాహితీ సదన్ బయట పచ్చని తోరణాలు వేలాడదీశారు. రంగు కాగితాలతో అందంగా అలంకరించారు. విశ్వసాహితీ సదన్ ఆడిటోరియం హాల్ జనంతో కిటకిటలాడుతోంది. విద్యుత్ కాంతుల మధ్య 'సదన్' మిలమిల మెరిసిపోతోంది. వేదికను కళాత్మకమైన పరదాలతో సుందరంగా అలంకరించారు. మైకులు, స్పీకర్లు, హాల్లో పురస్కార గ్రహీతలు, వాళ్ల బంధువులు, హితులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు, సాహితీ అభిమానులు, ప్రభుత్వ అధికారులు, అనధికారులతో సందడిగా ఉంది. హాల్ బయట పురస్కార గ్రహీతల వివరాలతో బ్యానర్లు కట్టారు. పురస్కార గ్రహీతలు, ముఖ్య అతిథులు, విఐపిలు, ప్రభుత్వ అధికారులు, మీడియా ప్రతినిధులు మొదలగు వారికి ప్రత్యేక బ్లాకులు కేటాయించి డిస్‌ప్లే చేశారు. అవసరమైన సూచనల బోర్డులను అక్కడక్కడా ఏర్పాటు చేశారు. గోపి తనకు కేటాయించిన స్థానంలో కూచున్నాడు. మైకులో వివిధ సాహితీ ప్రక్రియల్లో అత్యున్నత విలువలని సాధించిన వాళ్లకి పురస్కారాలు, వాళ్ల వివరాలు ప్రకటించారు. ఓ ప్రముఖ కవి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు. పురస్కార గ్రహీతలను ఒక్కొక్కరిని వేదిక మీదకు ఆహ్వానించి చక్కని వ్యాఖ్యానాలతో, మంగళ వాయిద్యాల మధ్య సన్మానిస్తున్నారు.

"మానవీయ విలువలతో రాసిన 'మట్టి వాసనలు' గ్రంథ రచయిత గోపి గారిని పురస్కారం గ్రహించ

వలసిందిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాం' అని మైకులో అనౌన్సు చేస్తున్నారు. గోపి హృదయంలో ఎన్నో భావ తరంగాలు ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నాయి. పేగుబంధం తెలియని ఓ అనాథ పెంచిన ప్రేమకు బందీ అయ్యాడు. వేదిక మీద గోపి గురించి ఆయన పుస్తకం విశిష్టత గురించి గొప్పగా మాట్లాడారు వక్తలు. ఇప్పుడు గోపికి రచయితగా ఎంతో సామాజిక బాధ్యత పెరిగింది. ఈ రోజు కోసమే గోపి బాపు కొమురయ్య కలలు కనేవాడు. ఆ కలలు తీరకుండానే అనారోగ్యంతో అర్థాంతరంగా కన్నుమూశాడు. పెంచిన అమ్మకు సుఖం అంటే తెలియదు. 'గోపి రావలసిందిగా' మళ్లీ అనౌన్స్‌మెంటు. ఆలోచనల నుంచీ తేరుకున్నాడు.

గోపి వినయంగా వేదిక మీదికి వెళ్లాడు. వినమ్రంగా సభకు నమస్కారం చేశాడు. ఓవైపు మంగళ వాయిద్యాలు మోగుతున్నాయి. మరోవైపు ఆహ్లాదకరమైన ఆనందానుభూతిని కలిగించే వ్యాఖ్యానాలతో గోపికి నుదుట తిలకం దిద్ది పూలమాలాలంకృతుణ్ణి చేశారు. శాలువా కప్పారు. రాష్ట్రపతి చేతుల మీదుగా యాభైవేల రూపాయల చెక్, జ్ఞాపిక, ప్రశంసా పత్రం బహూకరణ జరిగింది. కెమెరాలు క్లిక్‌మన్నాయి. ఆ ఆనంద క్షణాలు పొందటానికి గోపి ఎంతగానో శ్రమించారు. దాని వెనుక గతించిన వాళ్ల బాపు అండదండలు, నైతిక ధైర్యం, స్థైర్యం ఉన్నాయి. ఈ రోజు గోపికి కొమురయ్య లేని లోటు ఎంతో బాధ కలిగిస్తోంది.

“ఓ చిన్న విజ్ఞప్తి. పెద్దలు, సభాసదులు పెద్ద మనసుతో అనుమతిస్తారనే విశ్వాసంతో మా అమ్మను వేదిక మీదకు తీసుకువస్తున్నాను” అంటూ ముందు వరుసలో కూర్చున్న అమ్మ వద్దకు ప్రేమగా వెళ్లి నెమ్మదిగా వేదిక మీదకు తోడ్కొని వచ్చాడు. బక్కచిక్కి వడలిపోయిన ఆమె శరీరం వణుకుతోంది. తెల్లని వస్త్రాలు ధరించింది. తల నెరిసి ముగ్గుబుట్టలా ఉంది. వృద్ధాప్యపు ఛాయలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి. అమ్మను కుర్చీలో కూర్చోబెట్టాడు. తన మెడలో ఉన్న పూల మాలను తీసి ఆమె మెడలో ఆప్యాయంగా వేశాడు. భక్తితో పాదాభివందనం చేశాడు. గోపి ప్రేమానురాగాలకు ఆ తల్లి హృదయం పులకించిపోయింది. ఆమె కళ్లు చెమర్చాయి.

గోపి ప్రసంగించడానికి మైకు వద్దకు వెళ్లాడు. అతను పోడియం ముందు వినయంగా నిలుచున్నాడు. ముఖంలో ఏదో విషాదం. గోపి ఓ చేతిని పోడియంపై ఆనించి మరో చేత్తో మైకును పట్టుకున్నాడు. చిన్నగా సరాయించి ప్రసంగం ఆరంభం చేశాడు.

“వేదికనలంకరించిన పెద్దలు, సాహితీవేత్తలు, సభలో ఆహ్వానితులందరికి సవినయంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

ఆత్మీయులారా! పసితనంలో తల్లీ దండ్రీ పోయి అనాథగా రోడ్డు మీద గాలికి తిరుగుతున్న నన్ను ఈ అమృతమూర్తి, పైలోకాన ఉన్న మా బాపూ చేరదీసి పెంచి ఇంతవాణ్ణి చేసిన దేవతామూర్తులు. మా బాపు తన కలలు తీరకుండానే తరలిపోయాడు.

మా బాపుకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. అనారోగ్యం పాలయ్యాడు. నా కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డాను. ఆశ్చర్యమేమిటంటే నాకు ఒకటే కిడ్నీ ఉందని డాక్టర్లు తెలిపారు. అప్పట్లో మాది కిడ్నీ సమకూర్చుకోలేని ఆర్థిక దుస్థితి. దురదృష్టం వెంటాడింది మమ్మల్ని. కాలం మా బాపుని కాటువేసింది. గోపి కంఠం రుద్ధమైంది. తుండు గుడ్డతో కళ్లు తుడుచుకున్నాడు. కొద్దిసేపు నిశ్శబ్దం... తమాయించుకొని “మా బాపూ జ్ఞాపకార్థం ఈ పురస్కారపు డబ్బు యాభైవేల రూపాయలను 'మదర్ థెరిసా' కిడ్నీ బ్యాంకుకు విరాళంగా ఇస్తున్నాను” అంటూ భారమైన గుండెలతో అమ్మని పొదవి పట్టుకుని వేదిక దిగాడు. శబ్ద తరంగాలతో మారుమోగిన ఆడిటోరియం హాలును క్రమంగా నిశ్శబ్దం ఆవరిస్తోంది. ■

## వెలుగు బావుటా

**త**లపులు / మనిషి మేధలో
మహిమాన్విత బీజాలు
తలను / జెండాలా ఎగరేయడానికీ
సిగ్గుతో
నేలను దించడానికీ
అవే కద మూలం
తలపులు ఎప్పుడూ
తల మాసినవి కాకూడదు
తలమానికం కావాలి
తలపుల బీజాలు
ఇలాతలంలో
వెలుగు పూలు పూయాలి
విశ్వ శ్రేయస్సు కోరి
వెలుగు బావుటా ఎగరేయాలి

-బద్ది నాగేశ్వరరావు